క్యాంపు రోజే సదరం సర్టిఫికెట్
హర్షం వ్యక్తం చేసిన దివ్యాంగులు 7

ప్రమాదాల నివారణకు చర్యలు
మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మాకూ కావాలి ఇల్లు

- ఉమ్మడి జిల్లాలో తుదిదశకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- సొంతిల్లున్నా కూడా దరఖాస్తులు
- సమాధానాలకు విస్తుపోతున్న సర్వే బృందాలు
- 40 వేల ఇళ్లకు 7.40 లక్షల అప్లికేషన్లు
- అర్హుల ఎంపిక కత్తిమీద సామే!

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే తుది దశకు చేరింది. సర్వేలో మెదక్ జిల్లా 5వ స్థానంలో ఉండగా, సిద్దిపేట 11వ స్థానంలో, సంగారెడ్డి 20 స్థానంలో ఉన్నాయి. సర్వే పూర్తయ్యే క్రమంలో జిల్లాల స్థానాలు మెరుగుపడనున్నాయి. ఇంటింటా తిరుగుతూ సర్వే చేస్తున్న బృందాలకు విస్తుపోయే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ఆషామాషీ కాదని అర్థమవుతోంది.



ఆంధ్రజ్యోతిప్రతినిధి, సిద్దిపేట, జనవరి 7: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ఆరు గ్యారంటీలకు సంబంధించిన 13 సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించింది. ఇందిరమ్మ ఇంటి కోసం కూడా ఇదే దరఖాస్తులో ప్రత్యేక కాలమ్‌లో పేర్కొన్నారు. ఈ దరఖాస్తుల ఆధారంగానే ప్రస్తుతం పల్లెల్లో, పట్టణాల్లో ఇందిరమ్మ సర్వే బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాయి. సర్వే రెండు మూడు రోజుల్లో పూర్తికాబోతున్నది.

ఇల్లున్నా దరఖాస్తు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 7.40 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇల్లున్నవారే ఎక్కువ మంది ఉన్నట్టు ప్రస్తుతం సర్వే చేస్తున్న బృందాలు గుర్తిస్తున్నాయి. సొంత ఇల్లు ఉన్నప్పటికీ మళ్లీ దరఖాస్తు ఎందుకు చేశారని ప్రశ్నలు వేస్తుంటే రకరకాల సమాధానాలు వినాల్సి వస్తోందని సర్వే బృందంలోని సభ్యులు వాపోతున్నారు. తమ ఇల్లు పాతబడిందని, చిన్నగా ఉందని, కొడుకులకు కావాలని, మరమ్మతులు చేసుకుంటామని సమాధానమిస్తున్నారు. నివేశన స్థలం లేకున్నా ఇల్లు కోసం దరఖాస్తులు చేసినవారి సంఖ్య బాగానే ఉంది. ఇటీవల జరిగిన సమగ్ర కుటుంబ సర్వేపై ముఖం చిట్లించిన వారంతా కూడా ఇందిరమ్మ ఇంటి సర్వేకు పోటీ పడి పేర్లు నమోదు చేసుకోవడం విశేషం.

సవాల్‌గా అర్హుల ఎంపిక

నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఖర్చు చేస్తామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 60వేల నుంచి 70వేల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,500 మందిని ఎంపిక చేయాలంటే కత్తిమీద సాము కానుంది. ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి. 11 నియోజకవర్గాలకు 38,500 ఇందిరమ్మ ఇళ్లు వచ్చే అవకాశముంది. అదేవిధంగా జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, దూళిమిట్ట, కొమురవెల్లి, మద్దూరు మండలాలు, మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలం కూడా సిద్దిపేట జిల్లాలో ఉన్నాయి. ఈ మండలాలకు రావాల్సిన ఇళ్లతో కలిపితే 40వేల పైచిలుకు ఇళ్లు ఉమ్మడి మెదక్ జిల్లాకు మంజూరవుతాయి. ఈ లెక్కన 7 లక్షల దరఖాస్తులను పక్కనపెట్టడం అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారనుంది.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలు

జిల్లా	దరఖాస్తులు	సర్వేపూర్తయినవి	శాతం
మెదక్	1,91,100	1,83,349	96
సిద్దిపేట	2,30,483	2,17,867	95
సంగారెడ్డి	3,18,775	2,96,903	93



సంగారెడ్డిలో పొగమంచు

కొనసాగుతున్న చలి తీవ్రత

కోహీర్‌లో 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

కోహీర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో చలి తీవ్రత కొనసాగుతోంది. మంగళవారం ఉదయం మండల కేంద్రంలో 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని అల్గోల్ 10.4, మల్చెల్మ 10.9, న్యాల్‌కల్ 1.2, ఝరాసంఘం 11.2, అల్మాయిపేట 11.4, సత్వార్ 11.7 లక్ష్మీసాగర్ 11.9, మొగుడంపల్లి 12.0, కంగ్టి 12.1, ఆర్సీపురం 12.2, జహీరాబాద్ 12.7, అన్నాసాగర్ 12.8, హత్నూర 12.9, సిర్గాపూర్ 12.9, పుల్కల్ 12.9, రాయికోడ్ 13.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలోని దామరంచలో 12.3, కొత్తపేట్ 12.4, మనోహరాబాద్ 12.5, చిప్పలతుర్తి 12.7, శివ్వంపేట 13 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లాలోని కొండపాక 12.5, అంగడి కిష్టాపూర్ 12.9 మునిగండప్ప 13.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రజలకు తప్పని తిప్పలు

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జనవరి ఒకటో తేదీ నుంచి కోహీర్ మండలంలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. నాలుగు రోజుల రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కోహీర్ మండలంలో ఉదయం 9 గంటలైనా బయటికి రాలేనంత తీవ్రత ఉంది. సంక్రాతి వరకు చలి తీవ్రత కొనసాగే అవకాశముందని, అప్పటి వరకు అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

'హెచ్‌ఎంపీవీ' వైరస్‌పై

అప్రమత్తంగా ఉన్నాం

- సంగారెడ్డి జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు
- లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి
- జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ప్రొఫెసర్ అనిల్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటా న్యూమో వైరస్) కేసులు దేశంలోనూ వెలుగుచూస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నామని సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. సంగారెడ్డి జీజీహెచ్‌లో తీసుకుంటున్న ముందుజాగ్రత్త చర్యలపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

'హెచ్‌ఎంపీవీ' వైరస్ గురించి?

ఇదొక వైరస్. దీనిని తొలిసారి 2001లో గుర్తించారు. ఇది ప్రమాదకారి కాదు. చలికాలం వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. గాలి ద్వారా, తుంపర్ల ద్వారా వ్యాపించే అవకాశం ఉంటుంది. దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు, ఆయాసం తదితర లక్షణాలుంటాయి. లక్షణాల ఆధారంగా చికిత్స చేయాల్సి ఉంటుంది. విదేశాల్లో కేసులు నమోదవుతున్న తరుణంలో ప్రజల్లో భయాందోళన మొదలైందే తప్ప ఆందోళన అవసరం లేదు.

సంగారెడ్డి జీజీహెచ్‌లో తీసుకుంటున్న ముందుజాగ్రత్త చర్యలు?

ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు అప్రమత్తంగా ఉన్నాం. జీజీహెచ్‌లోని ఫిమేల్ మెడికల్‌వార్డును ఐసోలేషన్ వార్డుగా మార్చే ఏర్పాట్లు చేస్తున్నాం. వైరస్ లక్షణాలతో వచ్చే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించాం. అవసరమైన పరీక్షలు చేయాలని సూచించాం.

ప్రజలకు ఎలాంటి జాగ్రత్తలు సూచిస్తారు?

కొత్త వైరస్ గురించి భయపడాల్సిన అవసరం లేకపోయినా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నాం. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలి. శానిటైజర్ వాడాలి, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు నోటికి అడ్డంగా చేతి రుమాలు అడ్డుపెట్టుకోవాలి. లక్షణాలు తీవ్రంగా ఉంటే డాక్టర్ సిఫారసుతో మందులు వాడాలి.

ఇవేం దారులు..!

- గతుకులమయంగా గ్రామీణ రోడ్లు

7

- కొత్తవి నిర్మించరు.. మరమ్మతులు చేయరు



గుంతలమయంగా మారిన ఝరాసంగం మండలం బర్దీపూర్ రోడ్డు

ఆగని ఆక్రమణలు

- అటవీ భూముల్లో విస్తరిస్తున్న దుకాణాలు
- నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు

8



అటవీ భూమిని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇక..అటానమస్

గజ్వేల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కో-ఎడ్యూకేషన్)కు అటానమస్ హోదా కల్పిస్తూ యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) మంగళవారం ఉత్తర్వులను వెలువరించింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు, గవర్నర్, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, గజ్వే ల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కు యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఆర్. మనోహర్ వివరాలతో కూడిన లేఖను పంపించారు. డిసెంబరు 23న జరిగిన కమిషన్ మీటింగ్‌లో ఈ మేరకు స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపా రు. వచ్చే ఐదేళ్ల వరకు అటానమస్‌గా కొనసాగుతుందని, 2025-2026 విద్యాసంవత్సరం నుంచి 2029-2030 విద్యా సంవత్సరం వరకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు యూనివర్సిటీ వచ్చే 30 రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్వయం ప్రతిపత్తితో విద్యార్థులకు ప్రయోజనం చేకూరడంతో పాటు అడ్మిషన్ ప్రక్రియ సులభతరం అవుతుందని విద్యార్థులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాళ్లు కట్టేసి.. మూతులు కుట్టేసి..

- కుక్కలపై కర్కషం
- 20 శునకాల మృతి.. తీవ్రగాయాలతో మరో 11..
- 40 అడుగుల ఎత్తు బ్రిడ్జి పైనుంచి పడేసిన వైనం
- జంతు ప్రేమికుల ఆగ్రహం

కంది, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఎద్దు మైలారం శివారులోని ఓ బ్రిడ్జి పైనుంచి 31 కుక్కలను విసిరి వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి చూసింది. ఇంద్రకరణ్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 4న ఎద్దు మైలారం శివారులోని ఓ బ్రిడ్జి నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు 31 వీధి కుక్కలకు కాళ్లు కట్టేసి, మూతులు కుట్టేసి నలభై అడుగుల లోతు నుంచి విసిరేశారు. అందులో 20 కుక్కలు చనిపోయాయి. మరో 11 కుక్కలకు తీవ్ర గాయాలు అయ్యాయి. బ్రిడ్జి కింద కుక్కలను చూసిన స్థానికులు పోలీసులకు, జంతు ప్రేమికులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి గాయపడిన కుక్కలను హైదరాబాద్ నగరం నాగోల్‌లో ఉన్న వెటర్నరీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఆగ్రహం వ్యక్తం చేసిన జంతు సంరక్షణ సంస్థకు చెందిన వాలంటీర్లు ఈనెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కుక్కలను కావాలని ఎవరు బ్రిడ్జిపై నుంచి విసిరేసారని, వారు ఎవరు అనే విషయంపై ఆరా తీస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కుక్కలను ఎక్కడైనా చంపి వంతెనపై నుంచి పడవేశారా అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. చనిపోయిన 20 కుక్కల అవశేషాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి పంపినట్లు పోలీసులు తెలిపారు. జంతుప్రేమికుల ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనను జంతు ప్రేమికులు తీవ్రంగా ఖండిస్తున్నారు.



విచారణ జరుపుతున్న పోలీసులు

మున్సిపాలిటీ వద్దు..

- గుమ్మడిదల గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం



గుమ్మడిదల గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

గుమ్మడిదల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభిప్రాయం తీసుకోకుండా గుమ్మడిదల గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చడం సరికాదని ప్రజలు మండిపడ్డారు. గ్రామపంచాయతీగానే కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో స్పెషల్ ఆఫీసర్ అఖిలేష్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని సమస్యలపై చర్చించారు. ప్రజలు తెలిపిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఈవో ప్రభాకర్ హామీ ఇచ్చారు. అనంతరం గుమ్మడిదల పంచాయతీని ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చడంపై చర్చిస్తూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మున్సిపాలిటీగా మారితే పన్నుల భారం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ ప్రధానమైన పంచాయతీలో భారీ భవనాలు కానీ, వెంచర్లు కానీ లేవని గమనించాలన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటును విరమించుకోవాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చైనా మాంజా

అమ్మితే చర్యలు

జిల్లాలో 5 కేసులు నమోదు : ఎస్పీ



ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలో గాలి పటాలను ఎగురవేయడానికి చైనా మాంజాను వినియోగిస్తే చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ హెచ్చరించారు. జిల్లాలో పలుచోట్ల చైనా మాంజాను విక్రయిస్తున్న దుకాణాలపై పోలీసులు దాడులు జరిపారు. సంగారెడ్డి రూరల్, సంగారెడ్డి టౌన్‌లో ఒక్కటి చొప్పున, సదాశివపేటలో మూడు కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. నిషేధిత ప్లాస్టిక్/చైనా మాంజాలు వాడకం వల్ల ప్రతి సంవత్సరం అనేక మూగ జీవాలు, వాహనదారులు ప్రాణాలు పోతున్నాయని పేర్కొన్నారు. మాంజాలు కరెంట్ తీగలకు చుట్టుకొని షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆనందంతో జరుపుకొనే పండగ పర్యావరణానికి హానికరం కాకూడదని అన్నారు. ఎవరైనా చైనా మాంజా వినియోగిస్తే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లాలోని సంగారెడ్డి పట్టణంలో ఒక కేసు, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కేసు, సదాశివపేటలో మూడు కేసులు నమోదు చేసి, చైనా మాంజా సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక : సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారికే అందేలా చూడాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం తహసీల్దార్లు, ఆర్డీవోలు, ప్రత్యేకాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. దరఖాస్తులను పారదర్శకంగా విచారించి, గ్రామసభల్లో చర్చించిన అనంతరమే లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. కొల్లూరు, తెల్లాపూర్ డబుల్‌బెడ్‌రూం కాలనీల్లో సొసైటీల ఏర్పాటు కోసం సహకార శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, గృహనిర్మాణశాఖ అధికారి చలపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 280 ప్రత్యేక బస్సులు

- మెదక్ రీజియన్‌లోని 8 డిపోల నుంచి..
- ఈ నెల 10న సర్వీసులు ప్రారంభం



సంగారెడ్డి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇక పట్టణాలు, పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలు కానున్నది. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. సంక్రాంతికి ఎక్కడెక్కడో స్థిరపడిన వారు సొంతూరి బాట పడతారు. విద్యాసంస్థలకు ఈ నెల 11 నుంచి సెలవులు ప్రకటించడం, వీకెండ్ కలిసిరావడంతో ఈసారి బస్సులు కిటకిటలాడుతాయని ఆర్టీసీ అదనపు సర్వీసులు నడపాలని నిర్ణయించింది. మహాలక్ష్మి పథకం వచ్చిన తరువాత ఇప్పటికే బస్సుల్లో రద్దీ తీవ్రంగా పెరిగింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అందుకనుగుణంగా మెదక్ రీజియన్ వ్యాప్తంగా ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నెల 10, 11, 12 తేదీలతో పాటు తిరిగి 16 నుంచి 20 వరకు స్పెషల్ బస్సులు నడపనున్నారు.

పదో తేదీ నుంచి..

మెదక్ రీజియన్ వ్యాప్తంగా ఎనిమిది డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించారు. మెదక్ డిపో 40, నారాయణఖేడ్ డిపో 32, నర్సాపూర్ డిపో 17, సంగారెడ్డి డిపో 42, జహీరాబాద్ డిపో 37, సిద్దిపేట డిపో 57, గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ డిపో 36, దుబ్బాక డిపో 19 బస్సులు.. మొత్తం 280 బస్సులు నడపాలని ప్రణాళిక రూపొందించారు.

50 శాతం అదనపు బాదుడు

పండుగకు ఊళ్లకు వెళ్లే ప్రయాణికులపై బాదుడు తప్పేలా లేదు. సంక్రాంతి స్పెషల్ బస్సుల్లో సాధారణ చార్జీలపై 50 శాతం అదనంగా వసూలు చేయాలని నిర్ణయించారు. మామూలు రోజుల్లో రూ.100 ఉన్న టికెట్‌కు స్పెషల్ బస్సుల్లో రూ.150 వసూలు చేస్తారు. ప్రయాణికులు స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత కోరారు.

కోళ్ల దాణా లారీ బోల్తా

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు



చిన్నశంకరంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల దాణా తరలిస్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి శివారు మెదక్-చేగుంట రహదారిపై మంగళవారం జరిగింది. మెదక్ నుంచి మాసాయిపేటకు కోళ్ల దాణాను నింపుకుని వెళ్తున్న లారీ కొర్విపల్లి గ్రామ శివారు వద్దకు రాగానే.. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా లారీని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ మహ్మద్ సోఫీకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎస్ఐ నారాయణగౌడ్ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న లారీ

● తప్పిన ప్రమాదం



విరిగిన స్తంభాల వైర్లను సరి చేస్తున్న విద్యుత్ సిబ్బంది

శివ్వంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు లోడుతో వస్తున్న లారీ రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొన్న సంఘటన బిజిలిపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. శివ్వంపేట మండలం బిజిలిపూర్‌లోని శివశక్తి ల్యాబొరేటరీ పరిశ్రమకు గ్రామం మీదుగానే రోడ్డు ఉన్నది. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ బొడ్రాయి సమీపంలోకి రాగానే రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభాలు పూర్తిగా విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు అంటుకొని టీవీతోపాటు గృహ పరికరాలు కాలిపోయాయని గ్రామస్థులు తెలిపారు. మూడు గంటలపాటు విద్యుత్ అంతరాయం కలగడంతో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి పునరుద్ధరించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. నార్సింగికి చెందిన కృష్ణ హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో మిర్జాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, తిరుపతి అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి రైల్వే ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చిలప్‌చెడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మల్లెగారి బాలమణికి చెందిన గేదె కస్తూర్బా సమీపంలో మేస్తుండగా ప్రమాదవశాత్తు 1,100 కేవీ విద్యుత్ తీగ తెగి మీదపడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని, అధికారులు ఆదుకోవాలని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



అల్గోల్ చౌరస్తా నుంచి అల్లాన మీదుగా బీదర్ వెళ్లే రోడ్డు



పర్వతాపూర్ నుంచి ఆనెగుంట-జాడిమల్కాపూర్‌కు వెళ్లే దారి



ఝరాసంగం-మేదపల్లి గ్రామాల మధ్య కంకరతేలిన రోడ్డు

గమ్యం.. గగనం

జహీరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజక వర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. అడుగడునా గుంతలు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. గతంతో కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్ల మరమ్మతుల కోసం సుమారు రూ.70కోట్లు మంజూరు చేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అప్పట్లో పనులను నిలిపివేశారు. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని రద్దుచేసింది. 2024-24 సంవత్సరానికిగాను నియోజకవర్గంలో 17రోడ్లు 50 కిలోమీటర్లమేర బీటీ వేసేందుకు రూ.35.67 అత్యవసర మని ప్రతిపాదనలను పంపినా నిధులు రాకపోవడంతో రోడ్లు మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఆర్అండ్‌బీ పరిధిలోని 15 పనులకు గాను 115 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. వీటికోసం రూ.49.60 కోట్లు మంజూరైనా, టెండర్లయినా కాంట్రాక్టర్లు పనులు చేయడంలేదు. బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో పనులు చేయలేని పరిస్థితి ఉందని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

ఇవేం దారులు..!

ఉమ్మడి జిల్లాలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఏగ్రామానికి వెళ్లాలన్నా, గుంతలు, కంకరతేలిన రహదారులే దర్శనమిస్తున్నాయి. పాడైన రోడ్లకు కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడం, కొత్తవి నిర్మించకపోవడంతో అడగడుగునా గుంతలు పడి ప్రాణసంకటంగా మారాయి. దీంతో ఈ దారుల గుండా వెళ్తున్న వాహనదారులు, ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రయాణికుల ఒళ్లు హూనమవుతుండగా, వాహనాలు షెడ్లకు చేరుతున్నాయి. రాత్రిళ్లో వాహనదారులు గుంతలు పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. మరమ్మతులకు నిధులున్నా.. టెండర్లయినా పనుల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులు, నిధులకు సంబంధించి ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ బిల్లులు చెల్లిస్తుందోలేదోనని పలువురు కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఫలితంగా రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇక కొన్ని జాతీయ రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. డేంజర్ జోన్లలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరికొన్ని చోట్ల ఏళ్ల కొద్ది నత్తనడకన సాగుతున్న రోడ్లు పనులు కూడా వాహనదారులు, ప్రయాణికులకు శాపంగా మారింది.



రోడ్డు మధ్యలో పేరుకుపోయిన దుమ్ము కుప్పలు

దశాబ్దకాలంగా కొనసాగుతూనే..

● ప్రారంభంకాకముందే శిథిలావస్థకు..

రామచంద్రాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌కు అనుసంధానం చేస్తూ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం గోపన్‌పల్లితండా నుంచి ఉమ్మడి మెదక్ జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరు వరకు ఓఆర్ఆర్‌ను కలుపుతూ రూ.103.33.67 కోట్ల వ్యయంతో రేడియల్ రోడ్డును నిర్మించతలపెట్టారు. ఈ పనులను 2015లో అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. నేటికి ఈ రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడ రోడ్డు పూర్తయ్యింది.. ఎక్కడ కాలేదన్న దానిపై స్పష్టత లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రేడియల్ రోడ్డు ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరుకుంటుంది. బీటీ రోడ్డులో గుంతలను ప్రైవేటు వ్యక్తులు రెడిమిక్స్‌తో పూడుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేడియల్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన రహదారి

గతుకులుగా.. గ్రామీణ రోడ్లు

ఝరాసంగం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ తారు రోడ్లు పూర్తిగా గుంతలమయంగా, కంకర తేలడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు. ఝరాసంగం మండలంలోని మాచునూర్ నుంచి బర్దీపూర్‌కు వెళ్లే తారు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం చీలపల్లి, చీలపల్లి తండా, న్యాల్‌కల్, నారాయణఖేడ్ ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. అదే విధంగా మేదపల్లి నుంచి దిగ్వాల్ వరకు తారు రోడ్డు దెబ్బతింది. ఈ రోడ్డుపై గత ప్రభుత్వ హయాంలో సన్న కంకర వేసి వదిలిపెట్టారు. దీంతో దుమ్ము విపరీతంగా వస్తుండడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంగారెడ్డి, హైదారాబాద్ పట్టణలకు దిగ్వాల్ హైవే మీదుగా ప్రయాణం కొనసాగిస్తారు. బొజ్యానాయక్ తండా, పూర్యనాయక్ తండాల రోడ్లు కంకర తేలాయి. నెల రోజుల క్రితం బొజ్యానాయక్‌తండాకు చెందిన మహిళకు పురటి నొప్పులు రావడంతో కాన్పు కోసం ఝరాసంగంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీరా మార్గ మధ్యలోని ప్రసవించింది. తండాల నుంచి కక్కర్‌వాడ గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన బొజ్యానాయక్‌తండా రోడ్డు

రోడ్డు బాగాలేదని బస్సును రద్దు చేసిన ఆర్టీసీ



కొండాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే రోడ్డు దుస్థితి

నర్సాపూర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నుంచి పటాన్‌చెరుకు వయా కొండాపూర్, కాగజ్‌మద్దూర్, నత్నాయపల్లి మీదుగా సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉంది. పలు గ్రామాల ప్రజలు నిత్యం కళాశాలలు, పరిశ్రమలకు ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తారు. హైదరాబాద్ వెళ్లేవారు దీనిపై నుంచే వెళ్తారు. నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన రోడ్డు పరిధిలోని కొండాపూర్ నుంచి కాగజ్‌మద్దూర్, నత్నాయపల్లి, శేర్కాన్‌పల్లి వరకు పదికిలోమీటర్ల మేర రోడ్డు అత్యంత అధ్వాన్నంగా మారింది. అసలే సింగిల్ బీటీ రోడ్డు కాగా, పెద్ద పెద్ద గుంతలతో మట్టి రోడ్డు కంటే దారుణంగా మారింది. రోడ్డు బాగు చేసేంతవరకు ఈ గ్రామాల గుండా బస్సులు నడపమంటూ ఆర్టీసీ ఈ మధ్యనే సేవలు నిలిపివేయడం గమనార్హం.

నిధులున్నా.. టెండర్ ఖరారైనా..

దీన్ని డబుల్‌రోడ్డుగా మార్చేందుకు మూడేళ్ల క్రితమే రూ.2.67కోట్లు మంజూరు కావడంతోపాటు టెండరు కూడా ఖరారైంది. కానీ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. పనులు చేపట్టాలని పలుమార్లు అధికారులు నోటీసులు జారీచేసినా ఫలితం శూన్యం. బీఆర్ఎస్ హయాంలో మంజూరు ఈ పనులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందోలేదోనని, తాము ఈ పనులు చేయలేమంటూ ఉన్నతధికారులకు టెండర్లు దక్కించుకున్నవారు ఈ మధ్యనే లేఖ రాసినట్లు తెలిసింది.



రోడ్డు మధ్యలో సిమెంట్ దిమ్మెలు

ప్రమాదాలకు అడ్డాగా..

మనోహరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దండుపల్లి 44 వ జాతీయ రహదారి ప్రమాదాలకు అడ్డగా మారింది. మండలంలో కాళ్లకల్ నుంచి రామాయపల్లి వరకు సుమారు 8 కిలోమీటర్ల మేరకు 44 వ జాతీయ రహదారి పరిధి ఉన్నది. ఈ జాతీయ రహదారి గుండా వారానికి ఒకసారి ఎదో ఒకచోట ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అతి భారీ వాహనాలు అతి వేగంతో వస్తూ ద్విచక్రవాహనదారులను ఢీకొడుతున్నాయి. బోయినిపల్లి నుంచి కాళ్లకల్ వరకు నూతనంగా 6 లేన్ల రోడ్డు పనులు పూర్తి చేశారు. కాగా, డివైడర్ లేక అక్కడక్కడ రోడ్డు మధ్యలో సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలకు కారకాలుగా మారుతున్నాయి. ద్విచక్రవాహన దారులు ఇష్టారితిన మధ్యలో నుంచి రోడ్డు దాటడంతో రాత్రి వేళలలో అతి వేగంగా వస్తున్న భారీ వాహనాలు వారిని ఢీకొడుతున్నారు. నెల రోజుల వ్వవదిలో కాళ్లకల్ జనత హోటల్ చౌరస్తా వద్ద ఇద్దరు మృతి చెందారు. జాతీయ రహదారిపై ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం నిర్వహించిన కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమనిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన చోట్ల సూచిక, హెచ్చరికల, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రహదారి భద్రత మనందరి సమష్టి బాధ్యత అన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం విశేష కృషి చేస్తుందన్నారు. నేషనల్ హైవే, అర్ అండ్ బీ, పోలీస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రెవెన్యూ పాలన, ధరణి ల్యాండ్, కోర్టు కేసులు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఫారెస్ట్ భూ సమస్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ సమీక్ష నిర్వహించారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్ మెంచు నగేష్, డీఆర్వో భుజంగరావు, ఆర్అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, డీఎంహెచ్‌వో డా.శ్రీరామ్, డీటీవో వెంకటస్వామి,మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐ, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. అలాగే స్థానిక భరోసా సెంటర్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న సెల్యూట్ బేస్‌ను ఎస్పీ పరిశీలించారు. స్లాబ్ పనులు ప్రారంభించారు.

నిషేధిత చైనా మాంజా ప్యాకెట్లు స్వాధీనం

● వ్యాపారులపై కేసులు

సదాశివపేట/జహీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న వ్యాపారులపై మంగళవారం స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు. సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో చైనా మాంజాలను విక్రయిస్తున్న శివన్నగారి శ్రీను, నక్కలరాజు, బంటు గోపాల్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి 148 ప్యాకెట్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. చైనా మాంజాను అమ్మితే 8712656763 నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.



చైనా మాంజాల ప్యాకెట్లను చూపుతున్న సీఐ మహేష్‌గౌడ్

మెరుగైన వైద్య సేవలందించాలి

● ఎంపీ రఘునందన్‌రావు

మనోహరాబాద్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన 108 అంబులెన్స్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారితో ఎంపీ బీపీ చెకప్ చేయించుకున్నారు. తమ జీతం రూ.18 వేలు పెంచాలని ఆశా వర్కర్లు ఆయనను కోరారు. ఆరోగ్యం కేంద్రానికి మట్టిరోడ్డు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లగా రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. మనోహరాబాద్ రహదారి వద్ద ఎక్స్‌ప్రెస్ స్టాప్, గ్రామానికి పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలుర మూత్రశాల ఏర్పాటు చేయాలని ఎంపీ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్ రావు. మండల వైద్య అధికారి జస్పాదేవి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్, బీజేపీ జిల్లా నాయకులు, విజయ్, సాయిబాబా, అజయ్‌కుమార్, వెంకట్‌గౌడ్, శ్రీకాంత్, వెంకటేష్, ఐలయ్య, నర్సింహులు, అనిల్, బాల నర్సింహులు, మణివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


● కౌడిపల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) 7: మండలం పరిధి కంచన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన పట్లోరి ఫౌండేషన్ అధినేత బాలకిషన్‌రావు రూ.60 లక్షల విరాళం ఇచ్చారు. ఆ నిధులతో అదనపు తరగతి గదులు, ప్రహరీ, మూత్రశాలలు నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్‌కిషన్‌రావు అమెరికాలో స్థిరపడినప్పటికీ తాను చదువుకున్న పాఠశాలకు తనవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి బడితోపాటు గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాధకిషన్, బీజేపీ నాయకులు మురళీధర్ యాదవ్, మల్లేశంగౌడ్, ఎంఈవో బాల్‌రాజు, ప్రధానోపాధ్యాయుడు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జిన్నారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీ రఘునందన్‌రావుకు స్థానికులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా స్థానిక గండిచెరువు ఎఫ్‌టీఎల్ ముంపుతో వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలుగుతుందని వివరించారు.



మనోహరాబాద్ మండల ఆశావర్కర్లతో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

జాతీయస్థాయి పోటీలకు ఆకునూరు యువతి



కనకలక్ష్మి

చేర్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన తాటిపాముల కనకలక్ష్మి జాతీయస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాదు దోమలగూడ స్పోర్ట్స్ అథారిటీ హాస్టల్‌లో బీపెడ్ చదువుతున్న కనకలక్ష్మి ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 10-13వరకు అస్సాంరాష్ట్రం గుహవాటిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం జట్టు తరుపున పాల్గొననుంది. ఈమేరకు కనకలక్ష్మిని హ్యాండ్ బాల్ మెదక్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్, కార్యదర్శి రఫత్ ఉమర్‌తో పాటు రాజు, సన్నీ, తాడెం రమేశ్‌లు అభినందించారు.

క్యాంపు రోజే సదరం సర్టిఫికేట్

● హర్షం వ్యక్తం చేసిన దివ్యాంగులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : గతంలో సదరం సర్టిఫికేట్ దివ్యాంగుడి చేతికి అందాలంటే సుమారు నెల రోజులు పట్టేది. అదీకూడా డీఆర్‌డీఏ, డీఎంహెచ్‌వో, సర్కారు ఆస్పత్రి చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. సర్టిఫికేట్ అందలేదంటూ ప్రజావాణికి ఫిర్యాదులు కూడా వచ్చేవి. ఈ ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి క్యాంపు జరిగిన రోజే సర్టిఫికేట్ జారీ చేసేలా వైద్య అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. సంగారెడ్డి జీజీహెచ్‌లో మంగళవారం సదరం క్యాంపు జరిగింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.జి.అనీల్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని తొలి రోజు యుద్ధప్రాతిపదికన సుమారు 200 మంది దివ్యాంగులకు సాయంత్రం లోపే సదరం సర్టిఫికేట్లు అందజేశారు. కలెక్టర్, ఆస్పత్రి అధికారులు తీసుకున్న చర్యలతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు కృతజ్ఞతలు తెలిపారు.



సంగారెడ్డి జీజీహెచ్‌లో దివ్యాంగుడికి సదరం సర్టిఫికేట్‌ను అందజేస్తున్న సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

శివ్వంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చండీ శివారులోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ మహిళ కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ భిక్షాటన చేస్తున్నది. కాగా మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. చండి పంచాయతీ కార్యదర్శి బర్ల యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర మంగళవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం..... వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన మటికె సిద్ధయ్య(55) అదే గ్రామానికి చెందిన చంద్రయ్యను 2013లో పాతకక్షల నేపథ్యంలో గొడ్డలితో, రాళ్లతో దాడిచేయగా మృతిచెందాడు. ఈ మేరకు అల్లాదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నిందితుడు మటికె సిద్ధయ్యకు జీవిత ఖైదుతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు

జిన్నారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం సర్వే నెంబరు 10లో గల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ భిక్షపతి ప్రభుత్వ భూమి ఆక్రమణలపై విచారణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరిపినట్లు తేలితే నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు.

పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లింగారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 1వ తేదీవరకు గడువు ఉన్నదన్నారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఈవో పుష్పవేణి ప్రారంభించారు. పరీక్షలు చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు.

న్యూస్ బాక్స్

'సమాజ శ్రేయస్సు కోసం పాటు పడాలి'

నారాయణఖేడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సమాజ శ్రేయస్సు కోసం పాటు పడాలని ఖేడ్ ఏరియా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ రమేష్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి సూచన మేరకు మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, సభ్యులు చంద్రశేఖర్, రాజ్‌కుమార్ ఏరియా వైద్యశాలకు వీల్‌చైర్‌ను వితరణ చేశారు.

పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ బదిలీ

నారాయణఖేడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మండల పరిధిలోని జూక్కల్ శివారులోని విజయ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాములు, మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ ఇంకా నియమించలేదు. మంగళవారం పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాములను పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగం జీవన్ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులు సన్మానించారు.

త్వరలో గ్రామాల సందర్శన

ఝరాసంగం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలను కొన్నిరోజుల తరువాత సందర్శించి సమస్యలను తెలుసుకుంటానని సంగారెడ్డి ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. శిక్షణలో భాగంగా తాను నెలరోజుల పాటు ఇక్కడే పనిచేస్తానని తెలిపారు.

రింగ్‌రోడ్డు పనుల పరిశీలన

నారాయణఖేడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ చుట్టూ లింగ్‌రోడ్లుగా చేపట్టిన రింగ్‌రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు నర్సింహులు, రామక్రిష్ణ, మూఢ రామక్రిష్ణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నగేష్, జ్ఞానేశ్వర్, పరిశీలించారు. ఖేడ్-కరస్‌గుత్తి రోడ్డు వరకు, ఖేడ్ నుంచి కంగ్టి రోడ్డు వరకు, అక్కడి నుంచి చాంద్‌ఖాన్‌పల్లి వరకు, అక్కడి నుంచి మంగల్‌పేటలోని వేంకటేశ్వరాలయం వరకు, డీఎస్పీ కార్యాలయం సమీపంలోని నిజాంపేట-ఖేడ్- బీదర్ 161బీ జాతీయ రహదారిని కలుపుతూ రింగ్‌రోడ్ల పనులను బిట్లవారీగా చేపట్టారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

నిజాంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగస్తులకు బదిలీలు సహజమని మండల విద్యాధికారి సాంగని యాదగిరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన ప్రభాకర్ ఇటీవల చిన్నశంకరంపేటకు బదిలీపై వెళ్లారు. కాగా మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు అరుణ ఆధ్వర్యంలో ఎంఈవో యాదగిరి, ఉపాధ్యాయులు కలిసి ఆయనకు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాజేందర్, శ్రీలత, శ్రీనివాస్, ప్రమీల, బాల్‌లక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు పద్మారెడ్డి, మెడికల్ ఆఫీసర్ సంతోషి అన్నారు. మంగళవారం నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ శాతం, పోషకాహారలోపం, చర్మవ్యాధులు, దంత సమస్యల గురించి పరీక్ష చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సిద్ధరాములు, ఏఎన్ఎం జయంతి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు అండగా ఎర్రజెండా

జహీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో వ్యవసాయ వ్యవసాయేతర భూములను కోల్పోయిన రైతులకు (భూనిర్వాసితులకు) ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఎం అఖిల భారత కమిటీ సభ్యుడు వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని భీంభవన్‌లో భూనిర్వాసితులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిమ్జ్‌లో భూములు కోల్పోయిన రైతులకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ కూడ అన్యాయం చేస్తుందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు 120 గజాల స్థలం, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలన్నారు. వ్యవసాయ కూలీలందరికీ పునరావాసం కల్పించాలని, పునరావాస ప్యాకేజీ కింద రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూనిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోకపోతే దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.



అటవీ భూమిని ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసుకున్న దృశ్యం



అటవీశాఖ అధికారులు జారీచేసిన నోటీసులు

ఆగని భూ ఆక్రమణలు

- రోజురోజుకూ విస్తరిస్తున్న దుకాణాలు
- నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు

హత్నూర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని శేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులో గల పలువు మీది పోచమ్మ ఆలయ సమీపంలో అటవీ భూముల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతోంది. కొన్ని దశాబ్దాలుగా ఆలయ సమీపంలో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్న కొందరు స్థానికులు.. అక్కడ భక్తుల తాకిడి ఎక్కువ కావడం.. మద్యం, కల్లు ఇతరత్రా సరుకులకు భారీగా గిరాకీ పెరగడంతో దినదినం దుకాణాలను విస్తరిస్తూ, ఒక్కొక్కరు సుమారు అర ఎకరం, ఎకరం వరకు ఆక్రమిస్తూ రేకుల షెడ్లు వేశారు. ఈ క్రమంలో భారీ వృక్షాలను నేల కూలుస్తున్నా అటవీశాఖ అధికారులకు పట్టడం లేదు. అటవీ భూముల ఆక్రమణలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో మేల్కొన్న అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆ దుకాణాలు పూర్తిగా అటవీ భూమిలో ఉండడంతో పాటు ఎకరాల కొద్దీ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అటవీ భూముల్లో ఆక్రమంగా వేసుకున్న షెడ్లను స్వచ్ఛందంగా తొలగించాలని దుకాణదారులకు నోటీసులు జారీచేశారు. రెండుసార్లు నోటీసులు జారీచేసినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అటవీశాఖ అధికారులు ఇచ్చిన గడువు ముగిసి సుమారు నెలరోజులు కావస్తున్నా ఎలాంటి చర్యలకు పూనుకోకపోవడంలో అంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా అధికారుల తీరు పట్ల అనుమాన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శాలినిని 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా సంప్రదించగా.. సరైన సమాధానం చెప్పకుండా దాటవేశారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



హత్నూరలో కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు తావివ్వకుండా ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన హత్నూర రైతువేదిక ఆవరణలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అది నేటికీ అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ దావూద్, ఎంపీడీవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఇబ్బందులు తలెత్తకుండా చూడండి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్/నారాయణఖేడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో గల గిరిజనుల ఆరాధ్యదైవం మోతీమాత జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఉప్పర్‌పల్లితండా ఈనెల 12 నుంచి 15 వరకు జరగనున్న మోతీమాత ఉత్సవాల సందర్భంగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ జాతరకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, అభిమానులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేశుసింగ్, గౌరవాధ్యక్షుడు కిషన్‌పవార్, అసోసియేట్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఝరాసంగం మండలంలో గల పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకుడు జగదీశ్వర్ పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు మానుకోవాలి
- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేగుంట ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేగుంట, నార్సింగి మండలాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సహకారంతో రరూ.1.95 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తానే మంజూరు చేసినట్లు సోషల్ మీడియాలో చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. అబద్ధాలు చెప్పుకుని పబ్బం గడపడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటేనని ఆయన ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంజూరు చేయిస్తే నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీ చూపించాలని, లేనిపక్షంలో దుబ్బాక ప్రజలకు క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చేగుంట, నార్సింగి మండలాల అధ్యక్షులు వడ్ల నవీన్‌కుమార్, ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ మొజాంబిల్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు అన్నం అంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు స్టాలిన్ నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే



ఖేడ్‌లో సంఘం నాయకులతో కలిసి క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధి నిర్వహణతో పాటు సామాజిక బాధ్యతగా విద్యాభివృద్ధికి కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం టీపీటీఎఫ్ 2025 క్యాలెండర్లను సంఘం నాయకులతో కలిసి తన స్వగృహంలో ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర జిల్లా, డివిజన్ బాధ్యులు వెంకట్‌రాథోడ్, బాబురావు, గోవింద్‌రావు, ఆదాం పాల్గొన్నారు.

రైతుభరోసాపై కాంగ్రెస్ మోసం

- గుమ్మడిదల మండలంలో బీఆర్ఎస్ నిరసనలు



నిరసనలో మాట్లాడుతున్న కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి

గుమ్మడిదల/మునిపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రైతుభరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయడంతో బీఆర్ఎస్ నాయకులు కన్నెర్ర చేశారు. మంగళవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచులు చిమ్ముల నరసింహారెడ్డి, రాజశేఖర్, మురళీ, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బుదేరా చౌరస్తాలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, మాజీ ఎంపీపీ చంద్రయ్య, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు పరశురాంగౌడ్‌తో కలిసి మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

మెదక్ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల పాతూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి హైమావతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రీ స్కూల్ కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహిస్తున్నారని, గర్భిణులు, బాలింతలకు పెట్టే ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆహారం నిల్వలు, రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో, సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పేదలకు ఎన్నారై చేయూత

- ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు



ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్ బాధ్యులు

నారాయణఖేడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు నిర్వహిస్తున్నా.. పురిటిగడ్డపై ప్రేమతో వారికి చేతనైన సాయం చేస్తున్నారు. ఇందుకోసం జీఎంఆర్ఎఫ్ పేరిట ఫౌండేషన్ ఏర్పాటుచేసి ఇక్కడి ప్రజలకు తనవంతు సహకారాలు అందిస్తున్నారు నారాయణఖేడ్ పరిధిలోని కల్హేర్ మండలం మార్డికి చెందిన గుర్రపు మశ్చేందర్. కంగ్టి గిరిజనులు చెరుకు కొట్టడానికి వలసలు వెళ్తున్న క్రమంలో వంట చేసుకునేందుకు వీలుగా తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్యాస్‌పొయ్యిలు అందజేశారు. అలాగే, ఎవరైనా పేదలు చనిపోతే ఆ కుటుంబాలకు ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఇళ్లు లేని పేదల సొంత ఇంటి కల నిజం చేసేందుకు.. వారు సొంత ఇళ్లు కట్టుకునేందుకు తనవంతు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తల్లిదండ్రులు లేని పేదల వివాహాలకూ, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థికసాయం అందించడంతో పాటు నియోజకవర్గంలో ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగినా తన ఫౌండేషన్ ద్వారా వారికి చేయూతనందిస్తున్నాడు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ సంస్థల నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే గుర్రపు మశ్చేందర్ సొంత ఊరిపై ప్రేమతో సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

నేటి నుంచి వైకుంఠ ఏకాదశి వేడుకలు



అల్లాదుర్గంలోని వేంకటేశ్వరాలయం

అల్లాదుర్గం/సంగారెడ్డి రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10న నిర్వహించే వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) వేడుకల కోసం అల్లాదుర్గంలోని వేంకటేశ్వరాలయం ముస్తాబైంది. 8 నుంచి 10 వరకు నిర్వహించే ఉత్సవాల కోసం ఆలయ పూజారి శిలాంకోట ప్రవీణ్ శర్మ నేతృత్వంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. 8న నిర్వహించే గణపతి పూజ, అంకురార్పణం, ధ్వజారోహణం, సుదర్శన హోమాలను రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి చేతులమీదుగా నిర్వహించనున్నట్లు ప్రవీణ్‌శర్మ తెలిపారు. సంగారెడ్డిలోని వేంకటేశ్వర హరహర క్షేత్రంలో 10న ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆలయ కమిటీ ప్రతినిధి తోపాజి అనంతకిషన్ తెలిపారు. సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో గల ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సహాయ సహకారాలతో ముక్కోటి ఏకాదశికి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయ్‌భాస్కర్, నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటిపై టపాసులు పేల్చిన గుర్తు తెలియని వ్యక్తులు

రామాయంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట మండల పరిధి లక్ష్మాపూర్‌లో ఓ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి సమయంలో సుతిల్ బాంబులను కట్టి అంటించారు. భారీ శబ్దం రావడంతో ఇంట్లో నిద్రిస్తున్న రాజమణి అనే మహిళ భయంతో కేకలు వేస్తూ బయటకు పరుగుపెట్టింది. చుట్టుపక్కల వారు చేరుకుని ఇంటి రేకులపైన చెలరేగిన మంటలను నీళ్లతో ఆర్పారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలరాజ్ మంగళవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రామాయంపేట బంద్ విజయవంతం



రామాయంపేటలో భూ నిర్వాసితులకు మద్దతుగా వ్యాపారుల ర్యాలీ

రామాయంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో మరో బైపాస్ వద్దంటూ భూనిర్వాసితులు ఇచ్చిన బంద్ మంగళవారం విజయవంతమైంది. ఉదయం నుంచే భూ బాధితులకు తోడుగా వ్యాపారులు మద్దతుగా నిలిచి నిరసన ర్యాలీ చేపట్టారు. సంగారెడ్డి, రామాయంపేట మీదుగా ఎల్కతుర్తి వరకు చేపట్టిన హైవే విస్తరణలో భాగంగా ఇక్కడ బైపాస్ పనుల స్థల సేకరణ చేపట్టారు. అంతేకాదు ఇటీవల జరిగిన సమావేశంలో ఇందుకోసం సహకరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. ఎలాగైనా తమ భూములు లాక్కుంటారన్న ఆక్రోశంతో రైతులతో పాటు వ్యాపారులు సైతం ఆందోళనకు దిగారు. ఇదే జరిగితే పట్టణంలో వ్యాపారాలు మరింత దిగజారుతాయని వారు మండిపడ్డారు.

డ్రైవర్లు సంయమనంతో వాహనం నడపాలి

- సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య

సంగారెడ్డి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్లు సంయమనంతో వాహనం నడపాలని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత, డీఎం ఉపేందర్, ఎంవీఐలు నరేశ్, అరుణ, పట్టణ సీఐ రమేశ్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలి

- ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులుగా సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేయడంతో ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని పేర్కొన్నారు. తమను క్రమబద్ధీకరించాలని గతనెల 6 నుంచి సమ్మె చేపట్టిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తాత్కాలిక విరమణ ప్రకటించారు. మంగళవారం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె విరమణ పత్రాన్ని ఏడీ విజయకు అందించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

చిన్నశంకరంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు చెల్లించే వరకు గ్రామాల్లో స్వచ్ఛత నిర్వహించమని, ఈ నెల 10 వరకు విధుల్లో చేరమని పారిశుధ్య కార్మికులు స్పష్టం చేశారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీవో గిరిజారాణికి సమ్మెనోటీస్ అందజేసి మాట్లాడారు. చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరీ చేస్తున్నామని, ఐదునెలల నుంచి ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా పారిశుధ్య కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల బాధలను గుర్తించి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఫార్మాసిస్టులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ మీర్జాబేగ్

నర్సాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమని, వారు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ మీర్జాబేగ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసీ కాలేజీలో ఫార్మాసిస్టులకు ప్రారంభించిన నాలుగురోజుల శిక్షణకు హాజరై మాట్లాడారు. రోజురోజుకు వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఫార్మాసిస్టులు అవగతం చేసుకుని, తదనుగుణంగా మార్పు చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, డ్రగ్గిస్టు అండ్ కెమిస్టు అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి గరిపల్లి శ్రీనివాస్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రంగోళి పోటీలు

వెల్దుర్తి/పెద్దశంకరంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత గుర్తులపై రంగోళి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి.

రైతుల కష్టాలు తెలుసుకునేందుకు తీసుకొచ్చాం

- వీఎన్ఆర్ కళాశాల డాక్టర్ రవినాథ్



సదాశివపల్లిలో రైతులతో కలిసి నాట్లు వేస్తున్న వీఎన్ఆర్ ఎంబీబీఎస్ విద్యార్థులు

కౌడిపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతంలోని రైతులు వ్యవసాయంలో పడే కష్టాల విలువలను విద్యార్థులకు చూపించేందుకే గ్రామాలకు తీసుకొచ్చామని వీఎన్ఆర్ కళాశాల డాక్టర్ రవినాథ్ తెలిపారు. హైదరాబాద్‌లోని వీఎన్ఆర్(విజ్ఞాన జ్యోతి), డాక్టర్ రామానాయుడు కళాశాలకు చెందిన సమారు 70 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు మంగళవారం సదాశివపల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం గురించి రైతులను అడిగి తెలుసుకుని, రైతులతో కలిసి నాట్లు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శరబ్బినాయక్, రైతులు పాంద్ర నర్సింగరావు, బోయిని వీరయ్య, జనార్ధన్, గోవిందుపల్లి జోగయ్య పాల్గొన్నారు.

'317 జీవో బాధితులను సొంత జిల్లాలకు పంపాలి'

నిజాంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి కానుకగా 317 జీవో బాధితులను సొంత జిల్లాలకు పంపాలని రాష్ట్రీయ పండిత పరిషత్ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ పేర్కొన్నారు. 317 జీవో అమలై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా రాంపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టి మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకొని సొంత జిల్లాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మారెడ్డి, ఈశ్వరయ్య, అర్జున్, నరేష్, కుమారస్వామి, షాదుల్లా పాల్గొన్నారు.

పలుగుమీది పోచమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా మల్లాగౌడ్



హత్నూర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం శేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులో గల పలుగు మీది పోచమ్మతల్లి ఆలయ కమిటీని దేవాదాయశాఖ అధికారులు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. చైర్మన్‌గా శేర్ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్దగోని మల్లాగౌడ్, ధర్మకర్తలుగా చిట్టి దశరథ, కోన లక్ష్మణ్‌గౌడ్, గుడుగ శంకర్, కనిగేరి స్వామి, కోటగల్ల స్వరూప, ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా ఎం.శ్రీకాంత్ పేర్లను ఖరారు చేస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 9న ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.